**జూన్ 42 ఎమ్బీయస్ : బైబిల్ - 5**

అబ్రహాం పంపిన నౌకరు మెసపొటేమియాకు వెళ్లాడు. అక్కడ ఓ అందమైన, ఉదారస్వభావురాలైన అమ్మాయి రెబెకాను చూశాడు. ఆమె అబ్రహాం సోదరుడి మనుమరాలే. ఆమె కుటుంబం కూడా వరుడి గురించి తెలుసుకుని, ఆమోదించి, ఆ నౌకరుతో ఆమెను అబ్రహాం వూరికి పంపించింది. అబ్రహాం ఆమెను చూసి సంతోషించి తన కొడుకు ఇసాక్ (అప్పటికి 40 యేళ్లవాడు)కి యిచ్చి పెళ్లిచేశాడు. 175 ఏళ్ల వయసులో మరణించాడు.

ఇసాక్‌కు పిల్లలు పుట్టడం ఆలస్యమైంది. అతనికి 60 యేళ్ల వయసులో రెబెకా గర్భవతైంది. కడుపులోని కవలలు నిరంతరం కలహించడం గమనించి ఆమె దేవుడితో మొరపెట్టుకుంది. అప్పుడు దేవుడు చెప్పాడు – "నీ గర్భంలో రెండు జాతులు రూపుదిద్దుకుంటున్నాయి. పెద్దవాడి జాతి చిన్నవాడి జాతికి బానిసలవుతారు" అని. పెద్దవాడు పుట్టినపుడు ఒంటినిండా రోమాలతో పుట్టాడు. గొప్ప విలుకాడు అయ్యాడు. వేటకెళ్లి మంచి మంచి మృగాలను వేటాడి తెచ్చి తండ్రికి ఆప్తుడయ్యాడు. అతని పేరు ఇసావు. చిన్నవాడు జాకబ్ యింటిపట్టునే వుండి తల్లికి ప్రీతిపాత్రుడయ్యాడు. ఒకరోజు ఇసావు ఆకలితో నకనకలాడుతూ యింటికి వచ్చి తమ్ముణ్ని అతను వండుతున్న ఎఱ్ఱటి వంటకాన్ని వెంటనే పెట్టమన్నాడు. "పెద్దవాడిగా నీకున్న హక్కులు నా కిచ్చేస్తేనే.." అని షరతు పెట్టాడు జాకోబ్. సరేనని ఆ హక్కులు ధారాదత్తం చేశాడు ఇసావు. అతనికి వాటి పట్ల ఖాతరు లేదు.

ఇంతలో కరువు వచ్చింది. దేశాంతరం వెళ్లకపోతే తిండి గడిచేట్టు లేదు. దేవుడు కనబడి "ఈజిప్టు మాత్రం వెళ్లకు" అని హెచ్చరించాడు. అప్పుడు ఇసాక్ జెరార్ దేశానికి వెళ్లాడు. అక్కడి రాజు అబిమెలెచ్ అతన్ని ఆదరించాడు. అందగత్తెయైన భార్యను చూసి గతంలో తన తండ్రికి పట్టుకున్న భయమే ఇసాక్‌కూ పట్టుకుంది – భార్య అని తెలిస్తే అక్కడి ప్రజలు తనను చంపేసి తన భార్యను చేపడతారని. అందువలన ఆమె తన సోదరి అని చెప్పుకున్నాడు. ఓనాడు రాజు తన ప్రాసాదంలోని కిటికీలోంచి చూస్తూ వుంటే ఇసాక్, రెబెకా సంభోగించడం కనబడింది. విషయం గ్రహించి అతను ఇసాక్‌ను పిలిచి మందలించాడు. "ఇలాటి అబద్ధాల వలన మా వాళ్లు దారి తప్పి చరిస్తే ఎంత అనర్థం జరిగేది!" అని. రెబెకా జోలికి వెళ్లవద్దని తన ప్రజల్ని హెచ్చరించాడు.

అందమైన భార్య గురించి కాకపోయినా అక్కడి ప్రజలు మరొకలా అసూయ చెందారు. ఇసాక్ చేసిన వ్యవసాయానికి నూరింతలు ఫలసాయం రావడంతో వారు అతని బావులన్నీ పూడ్చేయడం మొదలుపెట్టారు. ఇది గమనించిన రాజు ఇసాక్‌ను పిలిచి నువ్వు దేశం విడిచి వెళ్లిపోవడం మంచిది అని సలహా చెప్పాడు. ఇసాక్ జెరార్ లోయకు వెళ్లి అక్కడ మళ్లీ నూతులు తవ్వించి మళ్లీ వ్యవసాయం చేశాడు. ఇబ్బడిముబ్బడిగా దిగుబడి వచ్చింది. అది తెలుసుకుని జెరార్ ప్రజలకు కనువిప్పుయింది – ఇసాక్ దేవుని దయకు పాత్రుడయ్యాడని, అతనితో వైరం పెట్టుకోకూడదని. అప్పుడు రాజు అబిమెలెచ్ తన మంత్రిని, సేనాపతిని వెంటపెట్టుకుని వచ్చి సఖ్యంగా వుంటామని ఇసాక్‌తో ప్రమాణం చేశారు. ఇసాక్ కూడా దానికి సమ్మతించాడు.

కొద్దికాలానికి ఇసాక్ చాలా ముసలివాడై పోయాడు. గుడ్డితనం వచ్చేసింది. పెద్దకొడుకుని పిలిచి "నా అంతిమ ఆశీర్వచనం యిస్తాను. నువ్వు వేటకెళ్లి నా కిష్టమైన మృగాన్ని వేటాడి వండి పట్టుకుని రా" అన్నాడు. రెబెకా యిదంతా వింది. తన కిష్టుడైన చిన్నకొడుకుని పిలిచి "మీ నాన్నకి యిష్టమైన రీతిలో ఎలా వండాలో నాకు తెలుసు. పెరట్లోని గొఱ్ఱెలతో నేను వండి పెడతాను. నువ్వు అది తీసుకుని వెళ్లి నేను ఇసావునని చెప్పుకుని మీ నాన్నవద్ద ఆశీర్వాదం తీసుకో" అని చెప్పింది. "అన్నకు ఒళ్లంతా వెంట్రుకలు కదా. నాన్న సులభంగా కనిపెట్టగలడు" అన్నాడు జాకబ్. గొఱ్ఱెతోలు కప్పుకోమని తల్లి సలహా చెప్పింది. వాడు అలాగే చేయడంతో ఇసాక్ మోసపోయాడు. ఇతనే పెద్దకొడుకనుకుని "నీకు సర్వసంపదలు కలుగుతాయి. అన్ని జాతులవారు నీకు మొక్కుతారు." అని ఆశీర్వదించాడు.

తర్వాత ఇసావు వేటనుండి తిరిగి వచ్చి మళ్లీ ఆశీర్వదించమనడంతో ఇసాక్‌కు జరిగినది తెలిసి వచ్చింది. ఒకే ఆశీర్వాదం యిద్దరికి యివ్వలేదు కాబట్టి, "నువ్వు కత్తి చేతబట్టి బతుకుతావు. మీ తమ్ముడికి ఊడిగం చేయవలసి వచ్చినా, నువ్వు తిరగబడిన రోజున నీ బంధాలు తెగుతాయి" అని ఆశీర్వదించాడు. దానితో తృప్తి పడని ఇసావుకి జాకబ్‌పై కోపం వచ్చింది. పెద్దకుమారుడిగా నా హక్కులు గతంలో తీసేసుకున్నాడు. ఇప్పుడు యిలా మోసం చేశాడు అని, మా నాన్న చనిపోయిన రోజున వీణ్ని చంపితీరతాను అనుకున్నాడు. తల్లి అది గ్రహించింది. కొడుకులిద్దరూ పోట్లాడుకోవడం యిష్టం లేక జాకబ్‌ను పిలిచి "నువ్వు మా దేశం వెళ్లిపోయి నా అన్నగారి కుమార్తెను పెళ్లాడి అక్కడే వుండిపో. మీ అన్న కోపం చల్లారాక తిరిగి వద్దువుగాని" అని చెప్పి, భర్త వద్దకు వెళ్లి "ఇసావు విదేశీయులైన యిద్దరు అమ్మాయిలను పెళ్లి చేసుకున్నాడు. వాళ్లు మనల్ని సరిగ్గా చూడక ఏడిపించుకు తింటున్నారు. రెండోవాడినైనా మా కుటుంబంలోని అమ్మాయిని చేసుకోమందాం" అంది. ఇసాక్ సరేనని కొడుక్కి మేనమామ దేశం వెళ్లడానికి అనుజ్ఞ యిచ్చాడు.



జాకబ్ తన మేనమామ గారి దేశం వెళుతూ మధ్యలో లజ్ అనే ఓ ప్రదేశం వద్దకు వచ్చేసరికి చీకటి పడింది. అక్కడే ఒక రాతిమీద తల పెట్టుకుని నిద్రపోయాడు. (పక్కనున్న పెయింటింగ్ ఆ సందర్భం గురించే) అతనికి కలలో ఒక నిచ్చెన కనబడింది. అది స్వర్గాన్నుండి

భూమి దాకా వుంది. దానిపై దేవతలు ఎక్కుతున్నారు, దిగుతున్నారు. "స్వర్గానికి ద్వారం యిక్కడే వుంది కాబోలు" అనుకున్నాడు జాకబ్. దేవుడు ఆ నిచ్చెన పై మెట్టుపై ప్రత్యక్షమై నీ వంశం వృద్ధి అవుతుందని, నేను తోడుగా వుంటానని సెలవిచ్చాడు. జాకబ్‌కు మెలకువ వచ్చాక తన తలకింద పెట్టుకున్న రాతిని స్తంభంలా నిలబెట్టి నూనె పోసి పూజించాడు. ఇప్పణ్నుంచి యిది "బెతెల్" (దైవసదనం) అనే పేరుతో వర్ధిల్లుతుందన్నాడు. దేవుడు తనకు అనుగ్రహించినదానిలో పదోవంతు దేవుడికి అర్పిస్తానని మొక్కుకున్నాడు. తన మేనమామ యింటివైపు పయనం సాగించాడు. తక్కిన కథ వచ్చే గురువారం. (సశేషం) **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2011)**